సీరియల్

బొమ్మిడి అచ్చారావు

(గత సంచిక తరువాయి)

అభిలాష్ తిరస్కారంగా చూశాడు.

కార్తీక్ చిన్నగా నవ్వి, "నామీద నీకున్న అభిమానానికి కృతజ్ఞుడ్ని. నా దీప్తిని శాశ్వతంగా నీదాన్ని చేసుకోబోతున్నందుకు నీకు అభినందనలు! నా దీప్తి సుఖంకోసం నేను నీకు సాయం చెయ్యటానికి సిద్ధంగా వున్నాను" అన్నాడు.

"గుడ్, వెరీగుడ్! నిన్ను మరణయాతనకు గురిచెయ్యకుండా వెంటనే ప్రాణంపోయేలా చంపుతాను. అదే నీకు నేను చేయగల సాయం!" అంటూ తన జోక్‌కి తనే విరగబడి నవ్వాడు రెడ్‌సన్. తర్వాత కార్తీక్ కట్లు విడదీశాడు.

"ఇదిగో, ఈ కాగడా నువ్వు తీసుకో! నువ్వు ముందు నడు. నేను వెనక నడుస్తాను. తల తిప్పటానికిగాని, నామీద తిరగబడటానికిగాని ప్రయత్నించకు! నా రివా

ల్వర్ నీ వెన్నుకు ఆనుకొనే వుంటుంది!" అన్నాడు రెడ్‌సన్ హెచ్చరికగా.

కార్టిక్ మందహాసం చేసి, "ఇంకా నన్ను నమ్మటం లేదా? ఈ సమయంలో కూడా నామీద అనుమానం కలిగివుండటం నా దురదృష్టం!" అన్నాడు.

ముందు కార్టిక్, వెనుక రెడ్‌సన్ ఆ నిశీధిలో ముందుకు సాగిపోయారు.

• • •

రెడ్‌సన్ రాగిరేకు బయటికి తీసి గుర్తులు పరిశీలించాడు. బాణం గుర్తు వేసిన దారినే పోతున్నట్టు గ్రహించి సంతృప్తిగా తలాడించాడు.

ఓ రెండు ఫర్లాంగులు నడిచారు. కార్టిక్ ఆటోమాటిక్ వాచిలో టైం చూసుకున్నాడు. రేడియండయల్లో ముళ్ళు పన్నెండు అంకెను సమీపిస్తున్నాయి. అర్ధరాత్రి!

"కార్టిక్, మనం దాదాపు అరమైలు నడిచి వుంటాం కదూ!" అన్నాడు రెడ్‌సన్.

"అవును."

"మరి ఈసరికే మనకి కొండల బారు, దాని వెనుకగా లోయలు కనిపించాలే, ఏం కనపడటం లేదు!"

"రెండు మైళ్ళు నడవాలి కదా!"

"రెండు మైళ్ళు నడవకుండానే నాలుగోవంతు దారి నడచేసరికి ఇవి వున్నట్టు గుర్తింపబడ్డాయి!"

"ఇంకా ముందుకి నడిచి చూద్దాం!"

"లోయలు పక్కగా ఏవో మరుగుజ్జు చెట్లు వాటి నానుకొని సెలయేరు వస్తాయని వసంతవర్మ చెప్పాడు కదా! సారంగంలో సెలయేరు ఎలా ప్రవహిస్తుంది?"

"నీరు పుట్టేది భూమి లోపలే కదా! సొరంగం తొలిచినపుడు నీటిబుగ్గ పైకి వచ్చి అది శిలయేరుగా ప్రవహిస్తూ వుండి వుండొచ్చు!"

"అవును, నువు చెప్పిందీ సబబుగానే వుంది!"

కార్తీక్ నడుస్తూనే తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. చేతనున్న కాగడాతో రెడ్‌సన్ మీద తిరగబడితే ఎలా వుంటుందని ఆలోచిస్తున్నాడు. ఏమాత్రం బెడిసికొట్టినా నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తాడు రెడ్‌సన్. తర్వాతయినా తనని చంపకుండా వదలడని తెలుసు! తను అతనితో బయలుదేరింది అతనికి భయపడి కాదు. ఏమాత్రం అవకాశం దొరికినా అతన్ని మట్టుబెట్టాలని!

తను ఈ అవకాశాన్ని వినియోగించుకోలేకపోతే రెడ్‌సన్ దీప్తిని చెరబట్టి తీసుకుపోతాడు! తమందర్నీ పిట్టల్ని కాల్చినట్టు వరసగా నిల్చోబెట్టి కాల్చేస్తాడు. అదే జరగబోతోంది! ఈ దారుణాన్ని జరక్కుండా చెయ్యగల అవకాశం, తనొక్కడికే వుంది! తనవాళ్ళు తనమీద కొండంత ఆశ పెట్టుకొని వున్నారని చివరిగా చూసినపుడు వాళ్ళ ముఖాల్లో స్పష్టంగా చూశాడు తను!

ఇంతలో వాళ్ళ కళ్ళముందు ఏవో మెరుపులు మెరిశాయి! కార్తీక్ అకస్మాత్తుగా ఆగిపోయాడు!

"ఏమిటి, ఏమిటా వెలుగు?" అన్నాడు రెడ్‌సన్ కళ్ళు నులుపుకుంటూ.

"అదే నాకూ అర్థంకావటం లేదు. నిధి తాలూకు కాంతి విరజిమ్ముతున్నదేమో అక్కడ!"

"చెక్ చెయ్యక...." అని రెడ్‌సన్ అంటుండగానే వాళ్ళ కళ్ళముందు ఓ గుహ కనిపించింది.

"ఇదేమిటి? సెలయేరు, సన్నటి దారి, మరుగుజ్జు చెట్లు కనపడకుండానే గుహ ప్రత్యక్షమైందేమిటి?" రెడ్ సన్ రాగిఫలకాన్ని పరీక్షగా చూస్తూ అన్నాడు.

కాత్రీక్ క్రీగంట అతనివంక చూశాడు. పొరపాటున కూడా రెడ్ సన్ రివాల్వర్ జేబులో పెట్టుకుంటాడేమో, తిరగబడదామనుకున్న అతని ఆశ నిరాశే అయింది!

రెడ్ సన్ రాగిరేకును దుస్తుల్లో దాచుకొని మళ్ళీ ముందుకు దృష్టి సారించాడు. ఎదురుగా యెవరో నించున్నట్టు, నవ్వుతున్నట్టు భ్రాంతి కలిగింది!

గాల్లో ఏవో చప్పుళ్ళు! సర్రున గాలిని కోస్తున్న ధ్వనులు, యెవరో చెవిలో గుసగుసగా మాట్లాడుతున్న అనుభూతి!

రెడ్ సన్ కి చెమట్లు పోశాయి! ఈ శబ్దాలు గతంలో తను విన్నాడు! అవును.... మాంత్రికుడి అనుచరులు తమని బంధించబోయే ముందు, ఆ తర్వాత కూడా యిలాంటి శబ్దాలు తను విన్నాడు.

"కాత్రీక్, నీకేమైనా శబ్దాలు వినిపిస్తున్నాయా?" అనడిగాడు రెడ్ సన్.

కాత్రీక్ కి కూడా రెడ్ సన్ కి ఎదురైన అనుభవమే యెదురైంది. అతనికి తెలుసు, అ దేమిటో! కాని, కావాలనే మాట మార్చాడు. "అబ్బే, నాకేమీ వినిపించటంలేదు! భయంకరమైన నిశ్శబ్దమే రాజ్యమేలుతున్నట్టుంది అంతటా! నిశ్శబ్దం చాలా భయంకరంగా వుంటుందన్న నిజం ఇప్పుడే తెలిసింది నాకు!" అన్నాడు రెడ్ సన్ ప్రశ్నకు సమాధానంగా.

"ఎదురుగా అన్నీ కొండలే కనిపిస్తున్నాయి! బహుశా యిదే అయివుంటుంది. రాగిరేకు చూడండి" అన్నాడు

మళ్ళీ కార్తీక్.

"ఎదురుగా కొండలు కాదు, గుహ కనిపిస్తోంది! ఇంకా మైలుపైగా నడిస్తేగాని కనపడని గుహ యిప్పుడే కనిపిస్తోంది!" అన్నాడు రెడ్‌సన్ అయోమయంగా.

కార్తీక్ ధైర్యం కోల్పోలేదు. కాగడా పట్టుకొని అలాగే నడుస్తున్నాడు.

అకస్మాత్తుగా వాళ్ళ ముందు ఏవో నీడలు కనిపించాయి. ఉన్నట్టుండి విపరీతమైన గాలి వీచసాగింది.

నీడలు ఆ గాలికి అనుగుణంగా నృత్యం చేస్తున్నాయి. కలగాపులంగా కీచుగా మాట్లాడుకుంటున్న సవ్వడి!

నీడలు నృత్యం చేయుటం చూసిన మరుక్షణం రెడ్‌సన్ గొంతు పెగల్లేదు. ఎలాగో మాట అతని నోటినుంచి వచ్చింది. "కార్తీక్, నీకు నీడలు డాన్స్ చేయటం కనిపిస్తోందా?"

కార్తీక్‌కి కనిపిస్తున్నాయి. అయినా ఆ విషయం ఒప్పుకోదలచుకోలేదు.

"అబ్బే. నాకేం కనిపించటంలేదు. కొండలు, మరుగుజ్జు చెట్లు కనిపిస్తున్నాయి!" అన్నాడు కార్తీక్.

"ఓ గాడ్! నాకేమయింది? నా కళ్ళకు అంతా విపరీతంగా కనిపిస్తోందే!"

కార్తీక్ లోలోన నవ్వుకున్నాడు. కాసేపు యిలాగే కొనసాగితే రెడ్‌సన్‌కి పిచ్చిపట్టడం ఖాయం! పిచ్చిపట్టిన కోతిలా గంతులువేస్తే అది అవకాశంగా తను వీడి పని పట్టాలి—అనుకొంటూ నడుస్తున్నాడు కార్తీక్.

ఒక్కసారిగా ఎవరో మీది దురికినట్టు అనిపించి పక్కకి తప్పుకున్నాడు కార్తీక్. కార్తీక్ పక్కకు తొలగగానే ఆ ఆకారం సరాసరి రెడ్‌సన్ మీద పడింది.

రెడ్‌సన్ ఆశ్చర్యంనించి తేరుకొని ఆ ఆకారంమీద గురిచూసి కాల్చాడు. ఆ నిశబ్ద నిశీధిలో రివాల్వర్ చప్పుడు ప్రతిధ్వనించింది.

గాల్లో ఎవరో గలగల నవ్విన శబ్దం!

రెడ్‌సన్ చుట్టూ చూశాడు. ఎవరూ కనిపించలేదు. ఎదురుగా కొండలబారు కనిపించింది.

"ఏమిటి మిష్టర్ రెడ్‌సన్, ఎందుకో నెర్వస్‌నెస్ ఫీలవుతున్నారు?" అన్నాడు కార్తీక్.

"అఁ అఁ! నథింగ్! ఏదో మనసు అన్‌సెటిల్డుగా వుండటంవల్ల! నిధి దొరుకుతుందన్న ఆనందంతో యేదో చేస్తున్నాను ఆలోచనలో పడి" అంటూ బలవంతాన నవ్వు తెచ్చుకున్నాడు రెడ్‌సన్.

ఇంతలో ఎక్కడ్నుంచో పెద్ద పెద్ద బండరాళ్ళు విరిగి పడుతున్న చప్పుడు వినిపించింది. ఇద్దరు త్రుళ్ళిపడి అటు చూశారు.

వాలుగా వున్న కొండచరియమీదుగా దొర్లి వస్తున్నాయి బండరాళ్లు. ఒకటి కాదు, రెండు కాదు— ఒకేసారి పది బండరాళ్లు! అంతదాకా ఎక్కడున్నాయో తెలియని బండరాళ్లు వరసగా దొర్లుకుంటూ మహావేగంగా వాళ్ళిద్దరిమీదకూ వచ్చేస్తున్నాయి.

అటు, యిటు తప్పుకోటానికి వీల్లేకుండా రాళ్ళు దొర్లుకుంటూ వస్తున్నాయి. ముందునుంచి వెనుకనుంచి, పక్కల నుంచీ ఒకేసారి పెద్ద చప్పుడుతో దొర్లుతూ వాళ్ళమీదకు శరవేగంగా వచ్చేస్తున్నాయి!

ఏం చెయ్యాలో అర్థంకాక నిర్ఘాంతపోయి నిల్చుండి పోయారు—కార్తీక్, రెడ్‌సన్.

* * *

"మనం వీలైనంత త్వరగా యిక్కడ్నుంచి తప్పించుకోవాలి!" అన్నాడు అభిలాష్ స్నేహితులవైపు సాభిప్రాయంగా చూస్తూ.

దీప్తి, అశ్విని, హిమవంత్ అతనివైపు చురుగ్గా చూశారు.

"కార్తీక్ కి యేదైనా ఆపద తలపెట్టడు కదా, రెడ్ సన్!" అన్నాడు హిమవంత్.

"కార్తీక్ ఒక్కడే కాదు, మనమందరమూ ఆపదలో వున్నాం! తన స్వార్థం కోసం రెడ్ సన్ కార్తీక్ ను తీసుకువెళ్ళాడు. అతని పని పూర్తవగానే మనందర్నీ వరసపెట్టి కాల్చేస్తాడు" అన్నాడు అభిలాష్.

"అతని దగ్గర బుల్లెట్స్ ఎన్నో లేవు. లోడ్ చేసుకున్నవి కాక మరో రౌండుకొస్తాయి, అంతే!" అన్నాడు అశ్విని. బుల్లెట్స్ అంతదాకా అతని దగ్గరే వున్నాయి కాబట్టి అతను వాటిని కచ్చితంగా అంచనా వెయ్యగలిగాడు.

"ఒక్కసారిగా అతను నిధినంతా బయటకి చేరవెయ్యలేడు! పైగా ఇక్కడికి రెండు మైళ్ళు. మళ్ళీ ఇక్కడ్నుంచి టైగర్ హిల్స్ వరకు మరో నాలుగైదు మైళ్ళు. చాలా దూరం! ఒక్క మనిషి ఇన్ని కోట్ల విలువ చేసే ధనరాశుల్ని కొండ దిగి వేన్ లోనో జీప్ లోనో లోడ్ చేసుకోవటం సాధ్యమయ్యే పని కాదు!" అన్నాడు అభిలాష్.

"అయితే, అతని అవసరం తీరేవరకు మనల్ని ప్రాణాలతో వుంచటం ఖాయమే! కాని మిస్ దీప్తిని రక్షించవలసిన బాధ్యత మనమీద వుంది. ఆ రాక్షసుడి దేగచూపు ఈమెమీదే వుంది!" అన్నాడు హిమవంత్.

"అది ఎలాగూ జరిగే పని కాదు. దయచేసి ముందుగా

నన్ను చంపెయ్యండి! మిమ్మల్ని వాడు ప్రాణాలతో వదలడు! మీరు లేకపోయాక నన్ను నేను రక్షించుకోవటంగాని, ఆత్మహత్య చేసుకోవటంగాని రెండూ సాధ్యపడవు. ఈలోపల వాడి చేతుల్లో నేను....” దీప్తి మాటల్ని దుఃఖం మింగేసింది.

స్నేహితులు ముగ్గురు ఆమెవైపు జాలిగా చూశారు. అభిలాష్ ఓదార్పుగా అన్నాడు. “మీరు అధైర్యపడకండి దీప్తీ! మన అదృష్టం బావుంటే కార్తీక్ చేతిలో రెడ్ సన్ చస్తాడు. కాని పక్షంలో వాడు బంగారాన్ని తీసుకుపోయే ప్రయత్నంలో వుండగా మనం ఎలాగైనా తప్పించుకొని వాడ్ని నరికిపారేద్దాం! ఎదురుగా వసంత వర్మ శవం మనకి కర్తవ్యాన్ని, ధైర్యాన్ని గుర్తుచేస్తోంది. అతని కత్తి మనకి సందర్భంగా ఉపయోగపడ్తుంది!” అన్నాడు అశ్విని పొడవాటి వసంతవర్మ కత్తినే దీక్షగా చూస్తూ.

“గుడ్ బాగా గుర్తుచేశావు. మనం దొర్లుకుంటూ ఆ కత్తిదాకా పాకగలిగితే మన బంధాలు తొలగించుకోవటం పెద్ద కష్టంకాదు! కత్తిని కోసుగా నిలబెట్టి దానికి ఈ తాడును ఆనించి కోసేస్తే కాసేపట్లో మనం బంధవిముక్తులం అవుతాం!” అన్నాడు అభిలాష్.

“ఎలా? చేతులు వెనక్కి విరిచి కట్టి, కాళ్ళకు చేతులకు కలిపి బంధనాలు వేశాడు. మళ్ళీ ఒకరినుంచి మరొకరికి సీరియల్‌గా కట్టేసి రెండు కొనల్ని బండకి బలంగా బిగించి కట్టేశాడు. మనం దొర్లటానిక్కూడా అవకాశం లేకుండా చాలా ప్లాన్డ్‌గా బిగించేశాడు. ముందు బండనుంచి ముడి విడిపోయేలా ప్రయత్నం చెయ్యాలి!” అన్నాడు అశ్విని.

నలుగురు నిరాశగా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. అప్పుడే రెడ్ సన్, కార్క్ బయల్దేరి ఓగంట పైగా గడిచిపోయింది. రెండు మైళ్ళు యిటు, రెండు మైళ్ళు అటు — నాలుగు మైళ్ళు నడవటానికి గంటా గంటన్నర పడుతుంది! అక్కడి కార్యక్రమం మరోగంట తీసుకున్నా, యింకా గంటన్నర వ్యవధి వుంది!

ఈలోపల తప్పించుకునే ప్రయత్నం చెయ్యాలి!

నలుగురు తీవ్రంగా ఆలోచిస్తున్నారు. దృష్టిసారించి ఆ బిలంలో వెతుకుతున్నారు, తమ బంధాలు తొలగించే సాధనం ఏముందా అని!

• • •

కార్క్, రెడ్ సన్ కొద్ది క్షణాలు దిక్కుతోచక అలాగే నిల్చుండిపోయారు. బండరాళ్లు దొర్లుతున్నాయి.

కార్క్ అటు యిటు చూశాడు. నాలుగువైపుల నుంచి రాళ్ళు దొర్లివస్తున్నాయి. ఇంకొన్ని క్షణాల్లో తామిద్దరు ఆ రాళ్ళమధ్య నలిగి చావటం ఖాయం!

రెడ్ సన్ అరిచి చెప్పాడు. "ఒక్కసారిగా బండల మీదినుంచి గెంతుతూ అవతలకు పరుగుపెట్టు కార్క్!" అంటూ అటో కాలు, ఇటో కాలు వేస్తూ బండలకింద కాళ్ల పడకుండా ఎగిరి గంతేస్తూ చాలా వేగంగా కప్పదాట్లు వేస్తూ ముందుకి పరుగెత్తాడు రెడ్ సన్. అతనికంటె వేగంగా కార్క్ రాళ్ళమీదుగా గెంతుతూ ముందుకి ఉరకలు వేశాడు.

బండరాళ్ళ ఉధృతం తగ్గిపోయింది! మరి కొద్దిక్షణాల తర్వాత అక్కడ యెలాంటి రాళ్ళు కనిపించలేదు!

రెడ్ సన్ కళ్ళు చికిలించి చూసి, "ఇదంతా యేదో మాయలా వుంది! ఎవరో మనల్ని కనికట్టుతో కట్టి

పదేస్తున్నాడు....ఆఁ, గుర్తొచ్చింది. ఇది ఆ కళ్యాణ స్వామి పనే అయివుంటుంది. తన చీప్ విద్యల్ని మన మీద ప్రయోగిస్తున్నాడు" అన్నాడు.

కార్తీక్‌కి ఈ విషయం మొదట్లోనే తట్టింది. తప్పించుకు పారిపోయిన మాంత్రికుడు కళ్యాణస్వామి ఏ మూలనుంచో ఏ క్షణంలోనైనా విరుచుకు పడవచ్చునని అతను అనుమానిస్తూనే వున్నాడు. అతను పారిపోయే సమయంలో తన ఎముకతో పారిపోయాడు! దానితో తమమీద క్షుద్రవిద్యలు ప్రయోగిస్తూ వినోదం చూస్తున్నాడు!

ఇదేగాని నిజమయితే యిక తననుకాని, రెడ్‌సన్‌ను గాని ప్రాణాలతో అతను విడిచిపెట్టడు! హింసించి, భయపెట్టి, పిచ్చివాళ్ళను చేసి, తమ ప్రాణాలు తామే తీసుకునేలా ప్రేరేపిస్తాడు! తను తియ్యకుండానే తమ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయేలా చేస్తాడు.

కార్తీక్‌కి భయం వెయ్యటం లేదు! నిష్కారణంగా క్షుద్ర శక్తులకి బలయిపోవటం అతనికి సంతోషంగా లేదు! ముఖాముఖి ఎదుర్కొని శత్రువులతో పోరాడి చావటంలో వున్న ఆనందం, యిలా నికృష్టంగా చావటంలో లేదు!

కార్తీక్ రెడ్‌సన్ వైపు చూసి, "ముందుకు వెళ్దామా?" అన్నాడు.

రెడ్‌సన్ వ్యంగ్యంగా నవ్వి, "వెనక్కు పోవటం భీరువుల లక్షణం! నేను పిరికివాడ్ని కాదు!" అన్నాడు దర్పంగా.

సరిగ్గా అదే సమయంలో ఎక్కడినుంచో సెలయేటి

గలగల వినిపించింది. మరికొద్ది క్షణాల్లో యిద్దరు ఓ సెలయేటి ఒడ్డుకు వచ్చేశారు.

రెడ్ సన్ ఆనందంగా యీల వేసి, "ఇదిగో సెలయేరు! అవిగో రాళ్ళ గుట్టలు!! ఇంకాస్త దూరంలోనే మనకి సన్నని బాట, నిధి వున్న గుహ కనిపిస్తాయి! మనం గమ్యానికి చాలా దగ్గర్లోకి వచ్చేశాం!" అన్నాడు.

కార్తీక్ మౌనంగా నడుస్తున్నాడు. సెలయేరు ఎంత లోతుందో! చటుక్కున రెడ్ సన్ ని సెలయేట్లోకి తోసేస్తే....! సెలయేట్లో జారుతూనే తనని గురిచూసి కాల్చేస్తాడేమో! అలా కాకున్నా సెలయేరు మనిషి మునిగేటంత లోతు లేకపోతే, రెడ్ సన్ తనని మరుక్షణం శవంగా మార్చేస్తాడు.

ఎలా....? నిధి దాచిన ప్రదేశం దగ్గరికి పోతున్నకొద్దీ కార్తీక్ లో ఆరాటం పెరిగిపోతోంది. రెడ్ సన్ నిధిని సమీపించేలోపల అతన్ని అంత మొండించగలడా తను? తన చేతిలో కాగడా తప్ప, వేరే సాధనం లేదు. ఆయుధం లేదు! రెడ్ సన్ చేతిలో మారణాయుధం వుంది! దాన్లో యింకా అయిదు బుల్లెట్లున్నాయి. అతని జేబులో యింకా ఎన్ని గుళ్ళున్నాయో! బుల్లెట్లన్నీ వ్యర్థమయిపోయేలా చేయగలిగితేగాని, రెడ్ సన్ నించి తనకు ప్రమాదం తప్పినట్టు కాదు!

ఇంతలో అకస్మాత్తుగా వాళ్ళిద్దమీదా ఏవో వస్తువులు పడటం ప్రారంభమయింది.

అవి సన్నటి పురుగులు! రెండడుగుల పొడవున్న తీగల్లాంటి పురుగులు. వర్షంలా ఒక్కసారిగా వాళ్ళిద్దరి మీదా ఏకధాటిగా పడుతూనే వున్నాయి. రెడ్ సన్, కార్తీక్ దుస్తులు దులుపుకోవడంలో అటు యిటుగా

అయ్యారు ఆ పురుగులు తమని కట్టడంలేదు కాని విపరీతమైన ఎలర్జీని సృష్టించాయి. ఒళ్ళంతా ఒకటే జిల! భరించలేని దుర్వాసన!

ఒళ్ళు జలదరించింది వాళ్ళకు. ఒక్కసారిగా అవి యెక్కడ్నుంచి వచ్చిపడుతున్నాయో తెలీకుండా వుంది! వాటినుంచి తప్పించుకోవటం బ్రహ్మప్రళయంలా వుంది! దులుపుకునే కొద్దీ యింకా ఒంటినిండా వచ్చి పడుతూనే వున్నాయి!

రెడ్‌సన్ ఇరిటేషన్‌తో కేకలు పెట్టాడు. "గాడ్, యిలాంటి బాధ పగవాడిక్కూడా వద్దు! ఇవి ఎక్కడినుంచి వచ్చి పడుతున్నాయి, ఏం చెయ్యబోతున్నాయి?" అంటూ.

చూస్తూండగానే తీగెల్లాంటి ఆ పురుగులు పొడవాటి తాడులాగా అల్లుకుపోయి వాళ్ళిద్దర్నీ కాళ్ళు చేతులు బంధించేశాయి.

ఈ విడ్డూరానికి ఆశ్చర్యపోతూ పురుగులు అల్లిన ఆ తాడును తెంచుకోవటానికి రెడ్‌సన్ విశ్వప్రయత్నం చేస్తూంటే, కార్తీక్ ఈ క్షుద్ర విద్యలు ప్రదర్శిస్తున్న వ్యక్తి కళ్యాణస్వామేనా, కాక మరెవరయి వుంటారా అని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

అతని చేతిలోని కాగడా, బంధనాలు తప్పించుకునే ప్రయత్నంలో నేలమీద పడిపోయింది! రెడ్‌సన్ మాత్రం రివాల్వర్ ఫర్మ్‌గా పట్టుకొని పురుగుల బంధాలు తెంచుకోవటానికి శక్తినంతా వినియోగిస్తున్నాడు.

• • •

"ఆఁ, అయిడియా! ఆ కాగడా చూశారా.... దాన్ని యెలాగైనా బండమీద కట్టిన తాడు ముడిమీద పడే

లాగా చెయ్యగలిగితే ఆ మంటకు నైలాన్ తాడు కరిగిపోయి, బండనుంచి కట్లు వూడిపోతాయి! తర్వాత దొర్లుకుంటూ అదే కాగడాకి గాని లేక కత్తికి గాని మన బంధాలు తాకిస్తే బంధవిముక్తుల మవుతాం!" అన్నాడు అభిలాష్.

తక్కిన ముగ్గురికీ అతని సలహా నచ్చింది. కాని కాగడా బండమీదకి పడేలా చేయటం ఎలా? కాగడాను బండ రాయికి పక్కగానున్న ఓ పొడవాటి రాతికి కట్టి వుంచాడు వసంతవర్మ. ఆ రాతినుంచి బండమీదికి ఆ కాగడా పడేలా చేయగలిగితే అది బండరాతికి కట్టిన తాడును కాల్చేస్తుంది. తాడు కరిగిపోయి వూడిపోతుంది!

అశ్వని మెదడు చురుగ్గా పనిచేసింది. నేలమీద చెదురుమదురుగా చిన్న చిన్న రాళ్ళున్నాయి. కాలితో రాళ్ళ దగ్గరగా లాక్కున్నాడు. కుడికాలు బొటన వేలిని, రెండో వేలికి మధ్య రాళ్ళను గుచ్చిపట్టి కాగడా కట్టబడివున్న పొడవాటి రాయిమీదకు విసిరాడు.

పది పన్నెండుసార్లు రాళ్ళు వ్యర్థంగా పక్కకి పడిపోయాక పదమూడోసారి అతని ప్రయత్నం ఫలించింది! కాగడా సూటిగా వచ్చి బండరాయిమీద పడింది. నైలాన్ తాడుకొస కొద్దికొద్దిగా కరుగుతూ, కాసేపటికి బండకి కట్టబడ్డ తాడు రెండు చివరలు కాలిపోయాయి.

అంతే, బండనుంచి వాళ్ళకు విముక్తి దొరికింది.

"థాంక్యూ అశ్వనీ!" అన్నాడు అభిలాష్ ప్రశంసాపూర్వకంగా.

"ఇప్పుడు నేలమీద దొర్లుదాం. నేను కాలితో నేల మీద ఫ్లాట్‌గా వున్న కత్తిని కోసుగా చెయ్యగలను.

మీరొక్కొక్కరు ఆ కత్తికి మీ కట్లను రాపాడించి, తెంచేసుకోగలరా?" అన్నాడు అశ్విని.

"దానికన్న కాగడా మంటకే కట్లు తాకించి, సులువుగా కట్లు వూడదీసుకోవచ్చు ననిపిస్తోంది నాకు!" అన్నాడు అభిలాష్.

"అదే తేలిక! కత్తి చాలా పదునుగా వుంది. ఎంత జాగ్రత్తగా వున్నా సర్రున చేతులు తెగిపోయే ప్రమాద ముంది!" అన్నాడు హిమవంత్.

"కాగడా మంటకూడా ప్రమాదమే! చేతులు కాలే ప్రమాదముంది. ప్రయత్నిద్దాం. ముందు కాగడాతో ట్రయల్ చేద్దాం!" అన్నాడు అశ్విని.

నలుగురు ఒకరిమీద మరొకరుగా దొర్లుతూ కాగడా వున్న బండ దగ్గరికి చేరుకోవటానికి సర్వశక్తులు క్రోడీకరించి ప్రయత్నిస్తున్నారు.

• • •

"రివాల్వర్ ప్రయోగించండి మిష్టర్ రెడ్ సన్!" అన్నాడు కార్తీక్.

రెడ్సన్ రివాల్వర్ వున్న చేతికూడా పురుగులు తాడులా అల్లుకుపోయే లోపల, చేతిని వెసులుబాటు చేసుకొని తాళ్ళవంటి ఆ పురుగుల్ని ఎలా కాల్చాలో అర్థంకాక సతమత మవుతున్నాడు.

"కార్తీక్, రివాల్వర్ ప్రయోగించటంవల్ల ప్రయోజనంలేదు. గుళ్ళు మన శరీరంలోకి దిగటం తప్పితే, యీ తాళ్ళు తెగవు. చాలా సన్నగా వున్నాయి!" అన్నాడు రెడ్సన్.

కార్తీక్ అంతటి నిస్సహాయ స్థితిలోనూ రెడ్సన్ పాట్లు చూసి లోలోపల నవ్వుకున్నాడు. తమని పురుగుల

కన్నా హీనంగా భావించి మాట్లాడిన రెడ్‌సన్ ఇప్పుడు అతి సన్నటి హీనమైన పురుగులకి బందీ అయ్యాడు.

కాలు కదపడానికి వీల్లేకుండా జలగల్లా పట్టేసుకున్న వింత పురుగుల్ని చూస్తుంటే, వాటినుంచి వస్తున్న దుర్వాసనను తల్చుకుంటే ఒళ్ళు కంపరమెత్తిపోతోంది కార్లోక్కి. అయినా భరిస్తున్నాడు.

ఇంతకీ ఎవరతను?

అకస్మాత్తుగా వికటాట్టహాసం వినిపించింది!

కార్లోక్, రెడ్‌సన్ నివ్వెరపోయి చూశారు.

ఎదురుగా కళ్యాణస్వామి! మాంత్రికుడు కళ్యాణ స్వామి! వికటంగా నవ్వుతున్నాడు!

కిందపడి మండుతున్న కాగడా వెలుగులో అతని ముఖం ప్రళయకాల రుద్రుడి ముఖంలా భగభగా మండుతున్నట్టు కనిపించింది వాళ్ళకు. అతను నవ్వుతున్నట్టు లేదు! నిప్పులు రాలుస్తున్నట్టు, మూడో నేత్రం తెరిచి భస్మం చేయబోతున్నట్టు కనిపించాడు!

రెడ్‌సన్ రివాల్వర్ ప్రయోగించాలని శతవిధాలా ప్రయత్నించాడు. కాని అప్పటికే పురుగుల తాళ్ళు అతన్ని కదలకుండా బంధించాయి! అతని చేయి స్తంభించి పోయింది. స్తంభించిపోయిన చేతిలో మారణాయుధం ఓ ఇనపముక్కలా నిరుపయోగంగా మిగిలి పోయింది!

కళ్యాణస్వామి రెడ్‌సన్‌కి దగ్గరగా వచ్చేశాడు. సూటిగా రెడ్‌సన్ కళ్ళలోకి చూస్తున్నాడు. అతని కళ్ళలోని అయస్కాంత శక్తికి మంత్రముగ్ధుడిలా అతని వైపే చూస్తూండిపోయాడు. నోటమాట రానట్టు, కదలిక లేనివాడిలా అలాగే నిల్చుండిపోయాడు!

కళ్యాణస్వామి వికటంగా నవ్వాడు. రెడ్‌సన్ దుస్తులు తడిమాడు. రాగిఫలకం పైకితీశాడు.

రెడ్‌సన్ ప్రతిఘటించాలనుకున్నాడు. అరవాలనుకున్నాడు. రివాల్వర్ ప్రయోగించాలనుకున్నాడు. కాని ఏ ఒక్కటీ చెయ్యలేకపోయాడు.

రాగిఫలకం అందుకొని ఒక్కసారి దానిలోకి పరీక్షగా చూశాడు కళ్యాణస్వామి. త్వరగా వేగంగా అడుగులు వేస్తూ ముందుకి సాగిపోయాడు.

రెడ్‌సన్ నిస్సహాయంగా చూస్తూండిపోయాడు.

కా రీక్ రెడ్‌సన్ నిస్సహాయ స్థితిని చూస్తూ మనసులోనే సంతోషిస్తున్నాడు!

కళ్యాణస్వామి శరవేగంతో ముందుకు దూసుకుపోతున్నాడు. రాళ్ళ గుట్టలు దాటేసి సన్న బాటలోకి ప్రవేశించాడు.

ఎదురుగుండా గుహ అతనికి స్వాగతం పలుకుతున్నట్టుగా కనిపించింది. కళ్యాణస్వామి మహానందంగా గుహ లోపలికి అడుగు పెట్టాడు.

* * *

“గుడ్, ముళ్ళన్నీ వచ్చేశాయి. అశ్వనీ ఒక్కొక్కరివీ విప్పేసెయ్యి!” అన్నాడు అభిలాష్.

ముందుగా అశ్విని తాళ్ళు తెంచుకొని అభిలాష్‌ని, హిమవంత్‌ని, దీప్తిని వరసగా బంధాలనుంచి తప్పించాడు.

తాడు కట్టినంత మేరా రక్తప్రసరణం లేక పాలిపోయిన శరీరభాగాలు మళ్ళీ రక్తాన్ని ప్రసారం చేయటం మొదలెట్టాయి. తిమ్మిరి తగ్గి అవయవాలు స్వాధీనంలోకి వచ్చాయి.

అప్పటికి కాగడా నేలమీదపడి పూర్తిగా మంటలు రేగి కాలిపోయింది.

బిలమంతా చీకటిమయమై పోయింది.

అశ్వని నేలమీద తడుముకుని కత్తిని చేత పట్టుకున్నాడు. నేలమీద బుల్లెట్స్ లేని రెండు గన్స్ అభిలాష్, హిమవంత్ చేతి ధరించారు.

అవే తమ ఆయుధాలు! శత్రు సంహారానికి, తమకు ప్రస్తుతం ఆత్మరక్షణ సాధనాలు అవే!

"ఎలా, దారి కనిపించటంలేదు? కాగడాలు యింకా ఏమైనా వున్నాయేమో చూద్దామా?" అన్నాడు హిమవంత్.

"ఇక వెతికి లాభంలేదు. రెడ్‌సన్ వున్న కాగడా పట్టుకుపోయాడు. మనం ఇదే కాగడాకు నారబట్టలేమైనా కట్టి, అక్కడున్న పాత్రలోని చమురులో ముంచి తంటాలు పడేటంత వ్యవధిలేదు! రెడ్‌సన్ ఈపాటికి తిరిగి వచ్చేస్తూంటాడు! కార్తీక్‌ని ప్రాణాలతో ఉంచాడో లేదో కూడా తెలియదు! యేమాత్రం అవకాశమున్నా కార్తీక్‌ని రక్షించుకోవాలి!" అన్నాడు అభిలాష్.

అశ్వని దీప్తివంక చూసి, "మిస్ దీప్తి, మీరు మా మధ్యగా నడవండి! అభిలాష్, నీకు నిధికి పోయే మార్గం గుర్తుంది కదూ!" అన్నాడు.

"ప్రతి చిన్న విషయమూ గుర్తున్నాయి. కాకపోతే చీకట్లో దారి తప్పిపోతామని భయంగా ఉంది!" అన్నాడు అభిలాష్.

అందరు బిలంనుంచి బయటికొచ్చారు. బయట పచ్చగా వెలుగు కనిపిస్తోంది.

"ఫరవాలేదు, కళ్యాణదుర్గం మీద ఎక్కడినుంచో

పడ్తోన్న చంద్రకిరణాలు పచ్చటి వెలుగును వెదజల్లుతున్నాయి. ఆ వెలుగులో ముందుకుసాగి పోలేమా?" అన్నాడు అశ్విని.

అభిలాష్ తలూపి, "ఇదిగో యెడమవైపు రెండో ద్వారం కనిపిస్తోంది! దీని పక్కగా వెళ్ళే దాదాపు రెండు మైళ్ళ అనంతరం నిధి దాచబడ్డ గుహ కనిపిస్తూంది! ఈలోపలే మనకు రెడ్ సన్, క్రాక్ ఎదురుపడతారని వూహిస్తున్నాను" అన్నాడు ముందు తను దారితీస్తూ. అతని మెదడులో రాగిరేకుమీది గుర్తులు, సంకేతాలు ముద్రపడిపోయాయి. పైగా వసంతవర్మ యిచ్చిన వివరణ కూడా మనసుకు బాగా హత్తుకుపోయింది.

ఓ ఫర్లాంగుదూరం నడిచేసరికి దీప్తి 'అబ్బా' అంటూ ఆగిపోయింది కాలు పట్టుకుని.

అందరు ఆగిపోయి, "ఏమిటి, ఏమయింది?" అంటూ ఆమె చుట్టూ చేరారు.

"ఏదో కాలిలో దిగినట్టనిపించింది. రక్తం స్రవిస్తోంది!" అన్నది.

అందరు అక్కడ పరిశీలనగా చూశారు. కోసుగా వున్న రాయి తెగింది!

అశ్విని "ఫరవాలేదు మిస్ దీప్తి! మేము ఏ పురుగు ముట్టించోనని భయపడ్డాం!" అన్నాడు తేలికగా వూపిరి తీసుకుని.

దీప్తి నీరసంగా నవ్వి లేవబోతూ పక్కకి తూలింది. అశ్విని ఆమెను పట్టుకునే లోపల ఆమె పక్కకు తూలి పడిపోయింది!

అంతే, ఒక్కసారిగా ఆమె కిందికి దిగిపోతున్న అనుభూతిని పొందింది!

"ఇది ఊబిలా వుంది, నన్ను పట్టుకోవటానికి ప్రయత్నించకండి, మీరు పడిపోతారు!" అన్నది గొంతు చించుకుంటూ. ఆమెను చేయి అందించి పట్టుకోబోయిన అశ్వానికి ఆమె చేయి అందలేదు.

అభిలాష్ సమయస్ఫూర్తితో ఆమెకు తన చేతిలోని గన్ తిరగేసి అందించాడు. కాని ఆమె అది అందుకునే లోపల అతివేగంగా కిందికి కూరుకుపోసాగింది!

అంతదాకా తమ పక్కన వున్న ఆ పెద్ద ఊబిని గుర్తించలేకపోవటం అందరికీ బాధ కలిగించింది.

అశ్వాని మెరుపు వేగంతో బిలంవైపు పరుగెత్తుకుని వెళ్ళాడు.

దీప్తి తలవరకు ఊబిలో కూరుకుపోయింది.

నిస్సహాయంగా చూస్తూ ఒడ్డునే నిలుచుండిపోయారు అభిలాష్, హిమవంత్ — స్నేహితురాలికి తుది వీడ్కోలు యివ్వటానికి సిద్ధంగా వున్నట్టు!

దీప్తి రెండు చేతులు ఎత్తి ఒడ్డున వున్న స్నేహితులకి నమస్కరించింది. "మీ స్నేహితుడికి నమస్కారాలు చెప్పానని చెప్పండి! చివరి క్షణాల్లో ఆయనను చూడలేకపోయినందుకు బాధపడ్డానని చెప్పండి! నా గురించి బాధపడవద్దని చెప్పండి!" అంటూ ఆమె అప్పగింతలు పెడుతుంటే అభిలాష్, హిమవంత్ కి కన్నీళ్ళు ఆగలేదు.

తమ కళ్ళముందే స్నేహితురాలు దుర్మరణం పాలవుతుంటే చూస్తూ నిల్చున్న తమమీద తమకే అసహ్యమనిపించింది.

అభిలాష్ తనూ ఉరికెయ్యాలనుకున్నాడు. కాని దీప్తి అప్పటికే వాళ్ళను హెచ్చరించింది — తనకోసం ప్రాణాలు బలిచేసుకోవద్దని! అయినా, ఆమె నల్లా

మాన్నూం లేే వాళ్ళ మనసులు ఆగటంలేదు! హిమవంత్ కూడా అదే పరిస్థితిలో వున్నాడు!

* * *

కళ్యాణస్వామి గుహలోకి రాగానే ముందుగా కుడి పక్కన వున్న సంకేత స్థలంలో చకచక ఎముకతో తవ్వాడు! ఎక్కువ శ్రమపడనవసరం లేకుండానే రాగి రేకు బయల్పడింది.

కళ్యాణస్వామి ఆనందంతో పెద్ద కేక వేశాడు!

రాగిరేకును పైకితీశాడు. బాగా మట్టిపట్టి వున్నది. దాన్ని మట్టి దులిపి, గుహ బయటకు తీసుకొచ్చి పచ్చగా మెరుస్తున్న మసక వెలుర్లో చూశాడు.

ముందు చూసిన రాగిరేకులాగే బాణాల గుర్తులు, సంకేతాలతో ఉన్న సంస్కృతంలో రాసిన అక్షరాలు చదువుకున్నాడు.

నిధి ఆ గుహలోనే యెడమవైపు నేలమాళిగలో ఉన్నట్టు సూచించబడింది.

కళ్యాణస్వామి పరుగు పరుగున గుహలోకి పరుగెత్తి ఎడమవైపు నేలమాళిగ గురించి వెతుక్కున్నాడు. సన్నటి రాతిపలక చేతికి తగిలింది. దాని చుట్టూ వున్న మట్టిని రాగిరేకుతోనే తొలగించి, గోళ్ళు జొనిపి, రాతిపలకను పైకిలేపాడు.

మనిషి దూరగల సన్నని బిలం కనిపించింది.

సరాసరి కిందికి మెట్లున్నాయి.

కిందినుంచి వెలుగు బిలంలోనుంచి పైకి ప్రసరిస్తోంది, ఏటవాలు కిరణంలాగా! అది కళ్యాస్వామికి గుర్తే. అక్కడ నిధి వున్నది! మణి మాణిక్యాలు, వజ్ర వైడూర్యాలు కాంతిపుంజాలను వెదజల్లుతున్న వెలుగది!

బంగారు కాంతి! కొన్ని వేలకోట్ల రూపాయల నిధి వెదజల్లుతున్న స్వర్ణ కాంతి!

కళ్యాణస్వామి ఆనందంతో పెద్దగా కేక పెట్టాడు. మెట్లు రెండేసి చొప్పున దిగుతూ నేలమాళిగలోకి దూరి కాడు!

అంతే! ఒక్కసారిగా బుస్సుమన్న శబ్దాలు ఆ నేల మాళిగను ప్రతిధ్వనింప చేశాయి. ఒకటి రెండు కాదు, పదులు యిరవయిల సంఖ్యలో కాల నాగులు బుస్సు మంటూ పడగలు విప్పి అతని పైపైకి వచ్చేశాయి.

నేలమీద ఏమాత్రం ఖాళీలేకుండా అంతా సర్పాల మయం!

నిధిని సర్వదా కొన్ని కాలసర్పాలు కాచివుంటా యన్న నిజం ఆలస్యంగా గ్రహించాడు కళ్యాణస్వామి!

అప్పటికే అతన్ని చుట్టుముట్టేశాయి సర్పాలు. తెలుపు, నలుపు, గోధుమ, రక్తవర్ణాల సమ్మిశ్రితమయిన కాలనాగులు వజ్రవైడూర్యాల ధగధగ కాంతులు ప్రతి ఫలించి మహా భయంకరంగా కనిపిస్తున్నాయి.

కళ్యాణస్వామి చేతిని గాల్లో ఊపి యేవో ఉచ్చ రించాడు — కాని అతని మంత్రం పూర్తికానేలేదు. ఒక్క సారిగా అనేక సర్పాల కోరలు అతని శరీరంలోకి కస్సున దిగిపోయాయి!

క్షణాలమీద అతని శరీరమంతా విషపూరితమై పోయింది.

నల్లగా బొగ్గులా మారిపోయాడు. యే నిధికోసం అహోరాత్రాలు శ్రమించి, క్షుద్రశక్తులను వశపరచుకుని పన్నెండేళ్ళు అజ్ఞాతవాసం చేశాడో ఆ నిధి కళ్ళముందే కన్నుల పండుగ చేస్తోంది! రత్నాలు, మణి మాణిక్యాలు,

వజ్ర వైడూర్యాలు, గోమేధిక, పుష్పరాగాలు, బంగారం — కన్నులను మిరుమిట్లు గొలిపే కాంతితో వెలిగిపోతోంది!

కాని ఆ కాంతిని చూడటానికి కళ్యాణస్వామి కళ్ళల్లో యిప్పుడు జీవం లేదు! అవి గాజుకళ్ళులాగా నిధి వంకే చూస్తున్నాయి!

నిలువునా నేలమీద, నిధిని తాకుతూ నిట్టనిలువుగా పడిపోయాడు కళ్యాణస్వామి!

* * *

ఒక్కసారిగా తమ బంధాలు ఎవరో విప్పేసినట్టుగా వీడిపోవటంతో కార్తీక్, రెడ్‌సన్ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

రెడ్‌సన్ రివాల్వర్‌తో పొజిషన్‌లోకి వచ్చేశాడు! అది ఇప్పుడు కార్తీక్‌కే గురిచేయబడి వుంది!

"ఆశ్చర్యం, ఇంతదాకా మనల్ని బాధించిన పురుగులు, అవి యేర్పరచిన బంధాలు అవన్నీ యేమైపోయాయి? కమాన్ కార్తీక్....హారియప్....కళ్యాణస్వామి యీ పాటికి నిధిని చేరిపోయి వుంటాడు. అది వాడికి దక్కనివ్వకూడదు, పరుగెత్తు" అంటూ వింటిని సంధించి వదిలిన బాణంలా ముందుకు దూసుకుపోయాడు రెడ్‌సన్.

మరుగుజ్జు చెట్లు దాటిపోయాయి, సెలయేరు దాటిపోయింది. రాళ్ళగుట్టలు దాటిపోయి, గుహ, సన్నటి బాట కన్నులపండువుగా కనిపిస్తోంది. తనతోబాటు కార్తీక్‌ని రెక్కపట్టుకుని లాక్కుపోతూనే వున్నాడు రెడ్‌సన్.

అనాసక్తంగా అతన్నే అనుసరిస్తున్నాడు కార్తీక్.

గుహలోకి అడుగుపెట్టాడు రెడ్‌సన్.

అతని చేతివేళ్ళు రివాల్వర్ మీద బిగుసుకున్నాయి.

సేఫ్టీ కాచ్ తప్పించాడు. వేలు ట్రిగ్గర్ మీద రెడీగా పెట్టి ఉంచాడు. కళ్యాణస్వామి ఇంకా అక్కడే వుంటే ఈసారి తనబారినుంచి తప్పించుకోలేడు! అక్కడే సజీవ సమాధి చేసెయ్యాలి—అనుకుంటూ గుహాంతా కలియదిరిగి బిలం దగ్గరకు పరుగెత్తాడు.

బిలానికున్న రాతిపలక అంతక్రితమే తొలగించబడి వుంది!

బిలం కిందినుంచి వస్తున్న పచ్చటి, ఎర్రటి, ఆకుపచ్చ వెలుగులు రెడ్‌సన్ కళ్ళల్లో కోటి కాంతులు ప్రతిఫలించాయి!

ఆనందంతో పెడబొబ్బ పెట్టాడు!

బిలం దగ్గరకు వెళ్ళాడు. కిందికి మెట్లు కనిపించాయి. అతనికాక్షణంలో ధనదేవత మంజీరనాదాలు మృదుమధురంగా, మనోరంజకంగా వినిపించాయేగాని, కరాళ నృత్యం చేస్తున్న మృత్యువు యినపగజ్జెల శబ్దం వినిపించలేదు.

"కాత్రీక్, నిధి దొరికింది. నిధి మనకే దొరికింది! నేను కిందికి దిగి నీకు అందిస్తాను. నువ్వు కిందికి రాకు!" అంటూ మెట్లమీదినుంచి బలంలోకి ఉరికేశాడు!

అంతే! ఒక్కసారిగా బుస్సుమన్న కాల సర్పాల ఫీత్కారాలు కాత్రీక్ ఒళ్ళు జలదరింప చేశాయి. అదే క్షణంలో రెడ్‌సన్ చేతిలోని రివాల్వర్ అయిదుసార్లు గర్జించింది! ఆ తర్వాత ఆ బుల్లెట్ శబ్దాలను కూడా మించిపోయిన భయంకరమైన చావుకేక, రెడ్‌సన్ నోటి నుంచి హృదయవిదారకంగా వెలువడింది.

కాత్రీక్ మోకాళ్ళమీద వంగి బిలంలోకి చూశాడు. అతని ఒళ్ళంతా ముచ్చెమట్లు పోశాయి! వెన్నున యేదో

జరజరమని పాకినట్టు అనుభూతి కలిగింది!

అక్కడ వజ్ర వైడూర్యాలు, గోమేధిక పుష్ప రాగాలు, మణి మాణిక్యాలు కాదు అతని దృష్టి నాకర్షించినవి!

చచ్చిపడివున్న కళ్యాణస్వామి, ఇంకా ప్రాణంకోసం పోరాడుతూ నికృష్టంగా మరణయాతన ననుభవిస్తున్న రెడ్ సన్!

ఎన్నో నిండుప్రాణాల్ని బలితీసుకున్న ఆ వేలకోట్ల రూపాయల నిధి, కేవలం విలువలేనిదిగా చిల్లిపెంకులుగా కనిపించాయి కార్తీక్ కి!

దేశంకాని దేశంనించి, కేవలం ధన కాంక్షతో ఆంధ్ర దేశానికొచ్చి, అన్యాయంగా నిధిని వశపరచుకుని కుల కాలని దురాశతో వచ్చి, కనకంతోబాటు కాంతకోసం కలలు కని, చివరికి ఆ కల కల్ల కాగా నిర్జీవంగా పడి వున్న రెడ్ సన్ ధనాశతో మగ్గిపోయే దురాశపరులకు సందేశాన్నిస్తున్నవాడిలా కనిపించాడు కార్తీక్ కి.

అంతే! బిలం ద్వారానికున్న సన్నటి రాతిపలకని యథాస్థానంలో అమర్చి, గుహనుంచి బయటపడి వచ్చిన దారినే, తనవాళ్ళని బంధించిన వసంతవర్మ నివాసంవైపు బాణంలా దూసుకుపోయాడు కార్తీక్!

* * *

అశ్విని రొప్పుతూ వచ్చాడు, నైలాన్ తాడుతో. అంతదాకా తమను బంధించిన ఆ తాడే తమ ప్రియతమ స్నేహితురాలి ప్రాణం రక్షిస్తుందని వాళ్ళు అంతవరకు కనీసం వూహించనుకూడా లేదు.

అప్పటికి దీప్తి తలమాత్రమే మిగిలివుంది భూమికి సమాంతరంగా, ఆమె రెండు చేతులు ఇంకా నమస్కారం

చేయూ అలాగే వున్నాయి!

ఆ చేతుల్లో షడేలాగా అశ్విని తాడు విసిరాడు.

"దీప్తి, దాన్ని పట్టుకోండి!" అంటూ అరిచాడు.

దీప్తి చటుక్కున, అసంకల్పితంగా తాడును పట్టుకుంది!

అభిలాష్, అశ్విని, హిమవంత్ ఒక్కసారిగా తమ సర్వశక్తులూ క్రోడీకరించి ఆమెని ఊబినుంచి పైకిలాగటంతో కృతకృత్యులయ్యారు.

దీప్తి ఒంటినిండా బురద! కాని ఆమె కన్నుల్లో తేజస్సు! స్నేహితులపట్ల అంతులేని కృతజ్ఞతా భావం అంతకుమించి తను కార్తీక్ ని మాడగలననే ఆత్మవిశ్వాసం, సంతృప్తి ఆమె కన్నులకి ఆ వింత తేజస్సును తెచ్చాయా అన్నట్టు కాంతిపుంజాల గనుల్లా, వెలలేని నిధిలా వున్నాయామె మీన నేత్రాలు!

సరిగ్గా అదే సమయానికి ఒగుర్చుకుంటూ, దూసుకొచ్చేశాడు కార్తీక్!

తనవాళ్ళని బంధవిముక్తులైన తన స్నేహితుల్ని ఆ పచ్చటి గడ్డి వెలుగుల్లో వెంటనే గుర్తుపట్టలేక పోయాడు. గుర్తింపుకి రాగానే ఆనందంతో కేక వేశాడు.

స్నేహితులు కార్తీక్ ని చూసి అంతకు మించి ఆనందంతో అరిచారు.

క్షణాల్లో జరిగిన విషయాలు ఒకరికొకరు చకచక చెప్పుకుని ఆశ్చర్యానందాలతో తబ్బిబ్బు అయ్యారు.

"ఇక్కడ యింకొక్క క్షణం కూడా వుండొద్దు. ఇప్పుడు రాత్రి నాలుగ్గంటలు. మరో రెండు గంటల్లో తెల్లవారుతుంది. తెల్లవారేవరకు యిక్కడ ఆగటం అనవసరం! టైగర్ హిల్స్ చేరిపోతే చాలు ముందు"

అన్నాడు కార్తీక్.

దీప్తి వంక చూసి "నడవగలవా?" అన్నాడు ఆర్తిగా.

ఆమె చీరంతా బురదగొట్టుకొని పోయింది. ఒళ్ళంతా బురద! అయినా ఆ పరిస్థితి అలాంటిది.

నీరసంగా నవ్వి తలూపింది.

"గన్స్ తీసుకొస్తున్నాం!" అన్నారు అభిలాష్, హిమవంత్.

"నేను కత్తి తెస్తున్నాను. ఏమో, మనం టైగర్ హిల్స్ చేరేలోపల మళ్ళీ ఏ అవాంతరాలు ఎదుర్కోవలసి వస్తుందో....!" అన్నాడు అశ్విని కత్తి గాలిలో ఝళిపిస్తూ.

ఎన్నో రోజుల తర్వాత అందరు ఆనందంగా నవ్వుకున్నారు!

* * *

టైగర్ హిల్స్ సమీపిస్తున్నాయనటానికి సూచనగా నేలమాళిగ లోపలికి బయటనుంచి సూర్యకిరణాలు లోపలికి పడుతున్నాయి.

అప్పుడు ఉదయం ఏడున్నర గంటలు కావస్తోంది.

ఆనందంగా కేక వేశాడు అశ్విని! "అదిగో టైగర్ హిల్స్!" అంటూ. అందరూ ఉత్సాహంగా కేరింతలు కొట్టారు.

సరిగ్గా గుహ బయటికి రాబోతూ అశ్విని అందరివంకా చూసి "ఆగండి! బయట ఎవరో మనుష్యులున్నారు. చాలా హడావిడిగా వుంది!" అన్నాడు.

అందరు చటుక్కున ఆగిపోయి ఒకరిముఖా లొకరు చూసుకున్నారు. కొంపతీసి మరో బేచ్ నిధికోసం తవ్వ

కాలు సాగించటం లేదుకదా!

చరిత్ర చర్విత చర్వణం కావటం లేదుకదా!

అందరిలోనూ యిదే ప్రశ్న! తేలుకొండీల్లాంటి ప్రశ్న! ఒక్కసారిగా అందర్నీ నిరాశానిస్పృహలు ఆవరించాయి. తమ కష్టాలు యింకా గట్టెక్కలేదా? తమకు విముక్తి లేదా?

అశ్విని గుహ ముఖద్వారం దగ్గరకు వెళ్ళి తొంగి చూశాడు. కొద్దిక్షణాలు అతనికేమీ అర్థం కాలేదు. తర్వాత ఆనందంతో చిన్నగా కేక వేశాడు.

"మన ప్రొఫెసర్స్, చింతపల్లె సర్పంచ్ గారు, గ్రామస్థులు—అంతా మనవాళ్ళే. రండి!" అంటూ గుహ లోపలికి కేక వేశాడు అశ్విని.

అందరు బిలబిల మంటూ గుహ బయటకి రావటం, అదే సమయంలో అంతదాకా అక్కడ పరిశోధిస్తున్న పోలీసులు, చింతపల్లె సర్పంచ్, గ్రామస్థులు, కాలేజీ వాళ్ళ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, కొందరు విద్యార్థులు అందరు ఒక్కసారిగా వాళ్ళను చుట్టుముట్టడం జరిగిపోయింది.

చింతపల్లె సర్పంచ్ ఆనందంగా చెప్తున్నాడు. "మీరంతా క్షేమంగానే వున్నారు కదా బాబూ! మీరు ఎన్ని రోజులయినా తిరిగి రాకపోగానే మాకు గుబులు పుట్టిపోయింది. ఈ లోపల మీ ప్రొఫెసర్లు కూడా వచ్చి మీ గురించి ఎంక్వయిరీ చేయటంతో మాకు కాలు చెయ్యా ఆడలేదు. మీరు చింతపల్లె తిరిగి రాకుండా మీ వూరెళ్ళిపోయారేమో ననుకొంటున్న మాకు అనుమానం వచ్చింది. అందరం టైగర్ హిల్స్‌కు వచ్చి చూద్దుము కదా, యిక్కడ ముక్కలు పగిలిపోయే దుర్వాసనతో

కుళ్ళిపోయిన శవాలు కనిపించాయి. వెంటనే పోలీసులకి కబురు చేశాము. అందరం కలిసి కొండ కొచ్చి చూస్తున్నాం. లోపలికి వెళ్ళాలా వద్దా అన్న ఆలోచనలో వున్నాం. ఇంతలో మీరొచ్చారు...."

ప్రొఫెసర్లు, విద్యార్థులు కార్తీక్ బృందాన్ని ప్రశ్నలతో ముంచెత్తేస్తున్నారు. ప్రొఫెసర్ శరశ్చంద్ర, డ్రయివర్ భరణి అకాలమరణాలు వాళ్ళను కొద్దిసేపు విచారసాగరంలో ముంచేసినా, కార్తీక్, అతని స్నేహితులు ప్రాణాలతో బయట పడటం ఆనందమే కలిగించింది.

కొన్ని వేల కోట్లరూపాయల నిధిని ప్రభుత్వానికి అందించిన కార్తీక్ బృందాన్ని దేశం ప్రశంసలతో ముంచెత్తింది.

—: సమాప్తం :—

అంకితం

నా ఆరాధ్య దైవం, కలియుగ దైవం,
కళ్యాణ చక్రవర్తి, సప్తచలాధీశుడు,
శ్రీనివాసుని పాదపద్మములకు
భక్తి ప్రపత్తులతో,

—రచయిత